
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 13 జూన్ 2025



'పది' సప్లిమెంటరీలో 77.84 శాతం ఉత్తీర్ణత

శ్రీకాకుళం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో 3,090 మంది బాలురు, 2,049 మంది బాలికలు మొత్తం 5,139 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో బాలురు 2,347 మంది, బాలికలు 1,653 మంది మొత్తం 4వేల మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 75.95 కాగా.. బాలికల ఉత్తీర్ణత శాతం 80.67 ఉంది. జిల్లావ్యాప్తంగా 77.84శాతం ఉత్తీర్ణత లభించింది. ఇక రాష్ట్రస్థాయి ఉత్తీర్ణతలో జిల్లాకు 12వ స్థానం దక్కింది.





శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

బడులు తెరుచుకున్నాయ్

- జిల్లావ్యాప్తంగా పాఠశాలల పునఃప్రారంభం
- సెలవులను నెమరవేసుకున్న విద్యార్థులు

బడి గంట మోగింది. 50 రోజుల వేసవి సెలవుల తర్వాత గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరచుకున్నాయి. జిల్లాలో ఎక్కడ చూసినా విద్యార్థుల సందడి కనిపించింది. తొలిరోజు ఉరుకులు, పరుగులతో పాఠశాలలకు చేరుకున్నారు. కొంతమంది విద్యార్థులు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ.. సెలవుల్లో గడిపిన స్మృతులను చెప్పుకున్నారు.

అమ్మల్లో ఆనందం

- జిల్లాలో 2,28,659 మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం వర్తింపు

6లో

ఆదిత్యాలయ ఈవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

అరసవల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి ఆదిత్యాలయం ఈవోగా కేఎన్‌వీడీ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కుటుంబ సమేతంగా సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. బాధ్యతలు స్వీకరించిన ఈవోకు ఆలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు, బి.ఎస్. చక్రవర్తి, అట్టాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎం బాల పురస్కార్ దరఖాస్తుల గడువు పెంపు

పాత శ్రీకాకుళం/ కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్- 2025కి సంబంధించి దరఖాస్తుల గడువును జూలై 31 వరకూ పెంచుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఏటా కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అసాధారణ ప్రతిభ కలిగిన బాల బాలికలను గుర్తించి.. ఈ అవార్డులను అందజేస్తారు. సాంస్కృతిక, విజ్ఞానం, సాంకేతిక, పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవ వంటి విభాగాల్లో విశిష్ట ప్రతిభ చూపిన 5 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవార్డుకు అర్హులు. స్వయంగా కానీ, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగత వివరాలు, ప్రతిభకు సంబంధించిన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్లు, పత్రికల్లో ప్రచురితమైన వార్తల క్లిప్పింగ్స్ వంటి ఆధారాలతో సంబంధిత పోర్టల్ ద్వారా జూలై 31 లోగా నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ తెలిపారు. ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్మాణం సరే.. నీరేదీ?



ప్రారంభానికి నోచుకోని మాతల ఎత్తిపోతల పథకం

- ప్రారంభానికి నోచుకోని మాతల ఎత్తిపోతలు
- 2018లో రూ.9.70 కోట్లతో పథకానికి శ్రీకారం
- పనులు పూర్తయి ఆరేళ్లయినా దిష్టిబొమ్మలా..
- వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నిర్లక్ష్యం
- ఏడు గ్రామాల రైతులకు అందని సాగునీరు

కొత్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి):

కొత్తూరు మండలం మాతల ఎత్తిపోతల పథకం పనులు పూర్తయినా.. ప్రారంభించేందుకు పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వంశధార నీటిని సద్వినియోగించేలా.. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు రూ.కోట్ల వ్యయంతో 2018లో ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు పూర్తయి ఆరేళ్లు కావస్తున్నా.. దీనిని ప్రారంభించకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. రూ.కోట్లాది నిధులు వృథాగా మారాయి. తమకు సాగునీరు అందక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంశధార నది ఎగువ భాగం, ఒడిశా సరిహద్దున ఉన్న కొత్తూరు మండలంలో బలద, మాతల, పెనుగోటవాడ, హంస, కుద్దిగాం, మాకవరం, వీరనారాయణపురం గ్రామాల రైతులు ఏటా సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లో సుమారు 1300 ఎకరాల పంట భూములకు నీరు అందక వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈక్రమంలో రూ.వేలలో పెట్టుబడి పెట్టినా.. సాగునీరు పూర్తిస్థాయిలో లేక పంట కోల్పోయి.. ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని టీడీపీ ప్రభుత్వ హయంలో అప్పటి పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రైతులకు సాగునీటి సమస్య పరిష్కరించేలా.. కొత్తూరు మండలం మాతల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. వంశధార నది నుంచి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించింది. అలాగే ఏడు గ్రామాల పరిధిలోని ఎనిమిది చెరువుల్లో ఎత్తిపోతల పథకం ద్వారా నీరు నింపితే రైతులకు పుష్కలంగా సాగునీరందింది.. పంటలు సుభిక్షంగా పండుతాయని భావించింది. 2018లో నాబార్డు ఐఆర్‌డీఎఫ్ నుంచి రూ.9.70 కోట్లు నిధులతో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాంట్రాక్టర్ నిర్ణీత కాలంలో ఏడాదిలోపే పనులు పూర్తి చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా.. ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ హయాంలో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే.. ఆ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో వైసీపీ పాలనలో ఐదేళ్లూ.. అప్పటి ఎమ్మెల్యే రెడ్డిశాంతి నిర్లక్ష్యం చేశారు. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు సైతం అందించలేదు. పనులు పూర్తయినా.. ఎత్తిపోతల పథకం ప్రారంభించకపోవడంతో సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత పాలకులు, అధికారులు స్పందించి.. ఈ పథకాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఈ విషయమై నీటిపారుదలశాఖ ఈఈ సుబ్రహ్మణ్యం వద్ద ప్రస్తావించగా.. 'ఎత్తిపోతల పథకం (మిగతా 6వ పేజీలో..)



డీజీపీ హరీష్‌గుప్తాతో ఎమ్మెల్యే శిరీష

డీజీపీ దృష్టికి బ్లాక్‌మెయిల్ బాగోతం

- ఆధారాలతో వివరించిన పలాస ఎమ్మెల్యే శిరీష

పలాస రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పలాసలో జరుగుతున్న బ్లాక్‌మెయిల్ బాగోతాన్ని స్థానిక ఎమ్మెల్యే శిరీష.. డీజీపీ హరీష్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అమరావతిలోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. 'పలాస నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఆసరాగా చేసుకొని కొంతమంది లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారు. అధికారులను బెదిరిస్తూ ఆర్థిక ప్రయోజనానికి కుయుక్తులు పన్నుతున్నార'ని ఎమ్మెల్యే శిరీష వివరిస్తూ పలు ఆధారాలను సమర్పించారు. బ్లాక్‌మెయిల్‌కు లొంగని వారిపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం, కక్షపూరితంగా వ్యవహరిస్తున్న జాబితాను, వారు చేసిన అక్రమాల వివరాలను అందజేశారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ.. తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిరీషకు హామీనిచ్చారు.

రెండు ఆలయాల్లో చోరీ

శ్రీకాకుళం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం కనుగులవానిపేటలో ఒకే రోజు రెండు దేవాలయాల్లో చోరీలు కలకలం రేపాయి. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కనుగులవానిపేటలోని పొదిలాం అమ్మవారు, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. ఆలయాల గేట్లు, తలుపుల తాళాలను బద్దలు కొట్టారు. హుండీల్లో నగదును అపహరించారు. గురువారం ఉదయం అర్చకులు, గ్రామస్థులు ఈ విషయాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ కె.రాము సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్‌తో పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాము తెలిపారు.



కూర్మలో కాలి బూడిదైన ఆధ్యాత్మిక మందిరం

కూర్మ గ్రామంలో కలకలం

- కాలిబూడిదైన ఆధ్యాత్మిక మందిరం
- దుండగుల పనేనంటున్న నిర్వాహకులు
- రూ. 50లక్షల ఆస్తి నష్టమని అంచనా

7లో

పాఠశాల అప్‌గ్రేడ్ ఎప్పుడు?

- 'అనంతగిరి'లో కానరాని అనుమతులు
- 9, 10వ తరగతుల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

8లో

డ్వాక్రా సొమ్ము గోల్‌మాల్!

- ఆర్పీ చేతివాటం?
- అధికారుల గోప్యం
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు

7లో



ఉద్దానంలో విక్రయానికి సిద్ధం చేస్తున్న కొబ్బరికాయలు

- రికార్డు స్థాయికి కొబ్బరి ధరలు
- వెయ్యికాయలు రూ.25 వేలు
- పంట లేక రైతుల దిగాలు

ధర భళా.. దిగుబడి డీలా

కవిటి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)

కొబ్బరి ధరలు ఆకాశాన్ని తాకుతుంటే.. దిగుబడి మాత్రం నేలచూపులు చూస్తోంది. కాయలు ధర రికార్డుస్థాయిలో పలుకుతుంటే.. అదే స్థాయిలో ఉత్పత్తి పతనమవుతోంది. ధర ఉన్నా అమ్మకానికి పంట లేకపోవటంతో ఉద్దానం రైతులు దిగాలు పడుతున్నారు. వాస్తవానికి వేసవి సీజన్‌లో కొబ్బరికాయల దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. కానీ, గత మూడేళ్లుగా నెలకొన్న తీవ్ర వర్షాభావం పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీనికితోడు తెల్లదోమ, నల్లముట్టి తెగుళ్లతో కొబ్బరి చెట్లు నామరూపాల్లేకుండా మారిపోయాయి.

100 కాయలు.. గగనం

ప్రస్తుతం ఎకరా కొబ్బరి తోట నుంచి వంద కాయలు దిగుబడి రావటం గగనంగా మారింది. గతంలో ఇదే తోట ద్వారా 300 వరకు కాయలు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం హోల్‌సేల్‌లో వెయ్యి కాయలు రూ.25వేలు పలుకుతున్నాయి. రిటైల్‌లో మాత్రం ఒక్కో కాయ రూ.30 నుంచి 35 వరకు పలుకుతోంది. కొబ్బరి బొండాలను చెట్ల నుంచి తీసి అమ్మకాలు సాగించేందుకు రైతులు ససేమిరా అంటారు. కానీ, అరకొరగా లభ్యమయ్యే వాటి ధరలు మాత్రం అధికంగానే ఉన్నాయి. ఒక్కో కాయ రూ.30నుంచి రూ.40 పలుకుతోంది. పండుగలు, వేసవి సీజన్‌లో ధరలు పెరుగుతుంటే రైతులు ఆనందపడేవారు. కానీ, గత మూడేళ్లుగా సరైన వర్షాలు కురవక, కొబ్బరి చెట్లకు నీటితడులు లేక దిగుబడి దిగజారింది.

ఒడిశా వ్యాపారులే దిక్కు..

ఉద్దానం కొబ్బరికి సంబంధించి గతంలో కంచిలి ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉండేది. ఇక్కడి మార్కెట్ నుంచి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు కొబ్బరి కాయలను ఎగుమతి చేసేవారు. దీనికి అనుబంధంగా కొబ్బరి పీచు, పుల్లల వ్యాపారాన్ని నిర్వహించేవారు. కాలక్రమంలో ఉద్దానంలో ప్రకృతి విలయాలకు కొబ్బరి పంట పూర్తిగా నాశనం కావడం, చీడ పీడలు, తెగుళ్లతో కాయల నాణ్యత, దిగుబడి తగ్గింది. ఆ ప్రభావం ప్రత్యక్షంగా కొబ్బరి మార్కెట్‌పై, పరోక్షంగా పీచు పరిశ్రమలపై పడింది. మొదట్లో వాటిని (మిగతా 6వ పేజీలో..)



మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న ఈదుపురం గ్రామస్థులు

పాఠశాల చెంతనే మద్యం దుకాణమా?

- తొలగించాలంటూ ఈదుపురం గ్రామస్థుల ఆందోళన
- లేదంటే పిల్లలను పాఠశాలకు పంపించబోమని స్పష్టం

ఇచ్ఛాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపాన కంటైనర్‌లో మద్యం దుకాణం ఏర్పాటుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల కిందట కేసుపురంలో కంటైనర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. గ్రామస్థులు ఆందోళన చేపట్టి అడ్డుకోవడంతో దానిని తొలగించారు. తాజాగా ఈదుపురం పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల వద్ద ఆందోళన చేశారు. పాఠశాల ప్రహరీకి సుమారు 150 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని, లేదంటే పిల్లలను పాఠశాలకు పంపించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మద్యం దుకాణం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. మద్యం దుకాణం షట్టర్లు దించేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. మద్యం దుకాణాన్ని తొలగించేలా చర్యలు చేపడతామని భరోసా ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నరసింహమూర్తి, సర్పంచ్ నర్తు ప్రసాద్, ఎంపీటీసీ వివేకానంద, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బడులు తెరుచుకున్నాయ్

● జిల్లా వ్యాప్తంగా పాఠశాలల పునఃప్రారంభం ● సెలవులను నెమరవేసుకున్న విద్యార్థులు



ఏంట్రా.. సెలవుల్లో ఎక్కడెక్కడికి వెళ్లావేంటి? బాగా ఎంజాయ్ చేశావా?



ఫస్ట్ హాజరు వేస్తే ఓ పనై పోతుంది



తర్వాత మాట్లాడుకోవచ్చు. టైం అయింది. లోపలకు వెళ్లండమ్మా

గుజరాతీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సుదీర్ఘ విరామం అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఉదయం గంట మోగకముందే విద్యార్థులు బడులకు తల్లిదండ్రుల సహాయంతో చేరుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ విద్యార్థులతో 50 రోజుల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. సెలవుల్లో క్యాంపులు, క్రీడలు, తాతగారింటికి వెళ్లి గడిపిన స్మృతులను నెమరవేసుకున్నారు. ఎదురుగా వచ్చిన ఉపాధ్యాయులకు నమస్కారాలతో పలకరిస్తూ మొదటి రోజు ఆనందంగా గడిపారు. గంట మోగిన వెంటనే ప్రార్థన, ప్రతిజ్ఞ చేసి తరగతి గదులకు వెళ్లారు. కాగా జిల్లాలో 2,630 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. యూనిఫారాలు, బూట్లు ఇంకా పూర్తిస్థాయిలో చేరలేదు. జిల్లాలో ఏడు మండలాలకు షూలు, తొమ్మిది మండలాలకు యూనిఫారాలు అందలేదు. ఆరో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థులకు ఎన్ని పుస్తకాలు తీసుకోవాలన్న దానిపై స్పష్టత లేకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. చాలాచోట్ల విద్యార్థులకు కిట్‌బ్యాగ్‌తోపాటు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, బెల్ట్‌లు, డైరీలు, యూనిఫారాలు అందజేశారు.



నమస్తే మేడం..



దోస్త్ మేరా దోస్త్.. ఎన్నాళ్లకెన్నాళ్లకు కలుసుకున్నాంరా!



టైమ్ అవుతోంది. కదలకుండా కూర్చోండి. వెనుక బ్యాగు జాగ్రత్తరా!

ధర భళా.. దిగుబడి డీలా

(ఐదో పేజీ తరువాయి)

ఎలాగో యజమానులు నెట్టుకొచ్చారు. రాను రాను నష్టాలు ఎక్కువ కావడంతో భరించలేక పరిశ్రమలను మూసివేశారు. 2018 తితలీ తుఫాన్ తర్వాత తమ వ్యాపారాలకు స్వస్తి పలికారు. దీంతో ఒడిశా వ్యాపారులే ఉద్దానం ప్రాంతానికి పెద్ద దిక్కుగా మారారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో దిగుబడి లేకపోవటంతో దళారులు కోనసీమ, తమిళనాడు కాయలను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువస్తున్నారు. వాటిని ఉద్దానం తోటల్లో నిల్వ చేస్తున్నారు. ఈ ప్రాంత కాయలుగా చెప్పి వ్యాపారులకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో వ్యాపారులు ఉద్దానం వైపునకు రావడం మానుకున్నారని రైతులు చెబుతున్నారు.

కోలుకోని ఉద్దానం కొబ్బరి: ఉద్దానం ప్రాంతంలోని తోటలకు వర్షాధారమే ప్రధాన నీటివనరు. అధికంగా వర్షాలు పడితే కొబ్బరి రైతు ఆనందానికి అవధులు ఉండవు. ఈ ప్రాంతంలోని కొబ్బరి చెట్లన్నీ పొడవాటి (టాల్‌స్టాయి) రకానికి చెందినవే. దీంతో ఈదురుగాలులు, తుపాన్లు వచ్చిన సమయంలో అధిక చెట్లు నేలకూలుతున్నాయి. 1999 నుంచి ఉద్దానంపై ప్రకృతి ప్రకోపం చూపుతోంది. ఆ ఏడాది ప్రారంభమైన పెనుతుఫాన్ల పరంపర 2018లో 'తితలీ' వరకు కొనసాగింది. వేలాది చెట్లు నేలకొరిగాయి. మళ్లీ కొత్తగా మొక్కలు నాటిన పదేళ్లకు గానీ దిగుబడి అందించవు. ఈ తరుణంలో కాండం తొలుచు పురుగు, తెల్లదోమ, నల్లముట్టి తెగుళ్ల చెట్ల ఎదుగుదల, దిగుబడిపై ప్రతాపాన్ని చూపుతున్నాయి. మొక్కల ను కాపాడుకోవటానికే ఎక్కువగా శ్రమించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ప్రకృతి షోయగం

టెక్కలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం మొఖలింగాపురం సమీపంలో గురువారం ప్రకృతి సోయగం ఆవిష్కృతమైంది. ఓ పక్క చిరుజల్లు లు కురుస్తుండగా మరో పక్క కొండల ను తాకుతూ ముద్దాడిన మేఘాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని చూసిన పలువురు గ్రామస్థులు మంత్రముగ్ధులయ్యారు.



కొండలను తాకిన మేఘాలు

ఆనందోత్సాహాలతో టీడీపీ ఏడాది సంబరాలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు సంబరాలను నిర్వహించాయి. ఆ పార్టీ కార్యాలయాల్లో నేతలు కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. ఈ ఏడాది చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున టీడీపీ కేడర్ పాల్గొంది.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాస: టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరికి కేక్ తినిపిస్తున్న నేతలు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు



శ్రీకాకుళం: వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు



ఆమదాలవలస: కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్ తదితరులు

ఖైదీల డబ్బులూ వదలని జగన్: మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్

ఆమదాలవలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తండ్రి పాలన అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచేసిన జైలు జీవితం గడిపిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. తన పాలనలో చివరికి ఖైదీల కష్టార్జితాన్ని కూడా వదలలేదని మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్ విమర్శించారు. గురువారం ఆమదాలవలస పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్‌తో పాటు టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మార్కెట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, పార్టీ జిల్లా నాయకులు మొదలవలస రమేష్, నందివాడ గోవిందరావు, అంబళ్ల రాంబాబు పాల్గొని కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో వివిధ రంగాలకు చెందిన నిధులను దారి మళ్లించిన జగన్ రెడ్డి.. చివరకు వివిధ జైళ్లలో ఖైదీలుగా ఉంటూ ఉపాధి పొందిన డబ్బులు (పీడీ ఖాతాలు) దారి మళ్లించిన ఘనుడు పెద్ద ఖైదీ అంటూ ఆరోపించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, పార్టీ నాయకులు బోర గోవిందరావు, విజయలక్ష్మిబాయి, కిల్లి సిద్దార్థ, మురళీదర్‌యాదవ్, సునీత, రాజ్యలక్ష్మి అన్నెపు భాస్కరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో

శ్రీకాకుళం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. విశాఖ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీశంకర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు



పాతపట్నం: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నేతలు




నరసన్నపేట: కేక్ కట్ చేసి నేతలకు అందిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నేతలు



టెక్కలి: కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అమ్మల్లో ఆనందం

● పిల్లలు అంతమందికీ తల్లికి వందనం
● పాఠశాలల వారీగా జాబితా విడుదల
● కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు



శ్రీకాకుళం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే 'తల్లికి వందనం' పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వాళ్లందరికీ నగదు అందజేస్తామని ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావడంతో గురువారం మహిళలకు శుభవార్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తల్లికి వందనం పథకం కింద నగదును జమ చేస్తున్నామన్నారు. దీంతో మాతృమూర్తుల్లో ఆనందానికి అవధుల్లేవు.

ఒకటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం..

ఒకటో తరగతి నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థికి కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలో లక్షలాది మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకానుంది. గురువారం మధ్యాహ్నం నుంచి పట్టణాల్లోనూ.. పల్లెల్లోనూ.. ఇదే సందడి.

జిల్లాలో 2,28,659 మందికి లబ్ధి..

లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ఉన్నతాధికారులే చేశారు. అధికారులు మండలాల వారీగా.. పంచాయతీల వారీగా అర్హుల జాబితా విడుదల చేశారు. ఇందులో పేర్లు ఉన్నవీ లేనివీ తల్లిదండ్రులు చెక్ చేసుకుంటున్నారు. జిల్లా విషయానికొస్తే.. ప్రభుత్వ పాఠశాలలు 2,638, ప్రైవేటు పాఠశాలలు 399.. మొత్తం 3037 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2,98,887 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సుమారు 30వేల మంది చేరే అవకాశముంది. వీరికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. మొత్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 2,28,659 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హులుగా జాబితా విడుదలైంది. ఈ విద్యార్థులకు సంబంధించి 1,52,563 మంది తల్లుల బ్యాంకు ఖాతాలో నిధులు జమకానున్నాయి.

తల్లుల ఖాతాల్లో రూ. 13వేల చొప్పున జమ..

గతంలో అమ్మఒడి పథకానికి ఉన్న మార్గదర్శకాలనే కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. అప్పట్లో ఒకరికి మాత్రమే ఇస్తే.. ఇప్పుడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తారు. అనాథలకు కలెక్టర్ సూచించిన ప్రకారం వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. తల్లుల ఖాతాల్లో రూ. 13వేల చొప్పున జమకానుంది. మిగిలిన రూ. 2వేలు పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తారు. జాబితాల్లో అర్హులు ఎవరికైనా చోటు దక్కకపోతే.. దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించనున్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుగా సతీష్

● అవార్డు అందించిన మంత్రి అచ్చెన్న



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న సతీష్

నరసన్నపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా ఇచ్చే వి.రామచంద్రరావు ఉత్తమ రైతు పురస్కారాన్ని జమ్ము గ్రామానికి చెందిన యువరైతు రెడ్డి సతీష్‌కు ప్రదానం చేశారు. గురువారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించి సత్కరించారు. వ్యవసాయంలో గత ఏడేళ్లుగా వివిధ నూతన ఆవిష్కరణలు, ఆలోచనలతో సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించడంతో సతీష్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ రైతు అవార్డుకు ఎంపి కయ్యారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన సతీష్ కొన్నాళ్లు ఉద్యోగం చేసిన తరువాత తండ్రికి వ్యవసాయంలో అండగా ఉండేందుకు ఉద్యోగం వదిలి వ్యవసాయం ప్రారంభించారు. పురాతన సాగు విధానాలకు స్వస్తి చెప్పి యంత్రీకరణ విధానాలు, ప్రకృతి వ్యవసాయం చేసి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సతీష్ ఉత్తమ రైతుగా ఎంపికవడంపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, గ్రామస్థులు అభినందించారు.

నిర్మాణం సరే.. నీరేదీ?

(ఐదో పేజీ తరువాయి)

పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వం మారడంతో ఎవరూ ప్రారంభించ లేదు. నదిలో వేసిన నీటిపంపు కూరు కుపోయింది. నది ప్రవాహం తక్కువగా ఉండడంతో ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందడం లేదు. నదిలో మళ్లీ కొత్తగా కొంతదూరం పైపులు వేసి నీటిని మళ్లించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

ఏడు గ్రామాలకు..



మాతల ఎత్తిపోతల పథకం ప్రారంభించి సాగు నీరు అందిస్తే ఏడు గ్రామా ల రైతులకు పుష్కలంగా పంటలు పండుతాయి అధికారులు స్పందించి ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేలా ప్రయత్నం చేయాలి.

- గండివలస తేజేశ్వరరావు, మాతల

సాగునీరు అందించాలి



మాతల ఎత్తిపోతల పథకం నిర్మించి ఆరేళ్ల కావ స్తున్నా.. నేటికి ప్రారంభించ లేదు. పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికా రులు దృష్టి సారించి సాగునీరు అందించాలని కోరారు.

-రేగేటి మోహనరావు, రైతు, మాతల

స్పందించాలి



మాతల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. అధికారులు, పాలకులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కరించాలి.

-కె.వెంకటరావు, రైతు, హంస

24 మంది కార్యదర్శులకు, ఈవోపీఆర్డీకి నోటీసులు



ఆరుబయట వేసిన చెత్త

కొత్తూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలో చెత్త సేకరణలో నిబంధనలు పాటించని 24 మంది పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ వసంతకుమారికి జిల్లా పంచాయతీ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఆరుబయట వేయడంపై సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా వారికి నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న వారిలో పనప, రాయల, పొనుటూరు, ఎన్‌కెపురం, మెట్టూరు బిట్-1, మాతల, మాకవరం, కుంటిబద్ర, కుద్దిగాం, కౌశల్యాపురం, కారిగూడ, కర్లెమ్మ ఆర్ఆర్ కాలీ, కలిగాం, కడుము, జగన్నాథపరం, హంస, గొట్టిపల్లి, దిమిలి, బమ్మిడి, బలద, అల్తి, అడ్డంగి పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

డ్వాక్రా సొమ్ము గోల్‌మాల్!

- ఆర్పీ చేతివాటం?
- గోప్యం వహిస్తున్న సంబంధిత అధికారులు
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు

ఆమదాలవలస, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని డ్వాక్రా మహిళల పొదుపు సొమ్మును ఆర్పీ (రిసోర్స్ పర్సన్) గోల్‌మాల్ చేయడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని ఓ మెప్మా ఆర్పీ స్వయంశక్తి సంఘాల సభ్యులు కట్టే పొదుపు సొమ్ము కలెక్షన్ చేసి గత కొన్ని నెలల నుంచి బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డులోని కొన్ని స్వయంశక్తి సంఘాల నుంచి వసూలు చేసిన సుమారు ఆరు నుంచి ఏడు లక్షల రూపాయల వరకు దారి మళ్లించినట్టు తెలుస్తుంది. గత 15 రోజుల నుంచి డ్వాక్రా మహిళలను ఆ ఆర్పీ తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో తామంతా మోసపోయామని డ్వాక్రా మహిళలు గ్రహించి, ఈ విషయాన్ని స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఉన్న మెప్మా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. అయితే మెప్మా అధికారులు మాత్రం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి, ఆర్పీ నుంచి రికవరీ చేసి తిరిగి ఇప్పిస్తామని బాధితులకు నచ్చచెప్పినట్టు భోగట్టా. అంతేకాకుండా డ్వాక్రా మహిళల డబ్బులు దారి మళ్లించిన ఆర్పీను కూడా ఇటీవల కార్యాలయానికి రప్పించి ఈ నెలాఖరు నాటికి పొదుపు డబ్బును బ్యాంకు ఖాతాలకు జమ చేస్తానని రాతపూర్వకంగా హామీ తీసుకున్నట్టు కొంతమంది అధికారుల ద్వారా తెలుస్తుంది. అయితే ఈ గోల్‌మాల్ ఆరు నుంచి ఏడు లక్షల రూపాయలు ఉంటుందా? లేక అంతకన్నా ఎక్కువ ఉంటుందా? అన్నది సంబంధిత అధికారులు లెక్కతేల్చాలని మరికొంతమంది మహిళలు కోరుతున్నట్టు తెలుస్తోంది.

తప్పు చేస్తే చర్యలు తప్పవు

ఈ విషయాన్ని మెప్మా పీడీ ఎస్వీ రమణ వద్ద ప్రస్తావించగా.. ఆమదాలవలస పట్టణంలో జరిగిన మెప్మా నిధులు గోల్‌మాల్ విషయం తనకు సమాచారం లేదన్నారు. ఈ విషయం తనదృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కూర్మ గ్రామంలో కలకలం

- కాలిబూడిదైన ఆధ్యాత్మిక మందిరం
- దుండగుల పనేనంటున్న నిర్వాహకులు
- రూ.50లక్షల ఆస్తి నష్టమని అంచనా

హిరమండలం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గ్రామంలో కూర్మలో కలకలం రేగింది. దుండగులు ఓ మందిరానికి నిప్పంటించడంతో కాలిబూడిదైంది. ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే రాధాకృష్ణ మందిరంలో మంగళవారం అర్ధరాత్రి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. భక్తులు ఆందోళనతో పరుగులు తీశారు. నిమిషాల వ్యవధిలో మందిరం కాలిపోయింది. రూ.50లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఘటనా స్థలంలో దుండగుల ఆనవాళ్లు సేకరించేందుకు పోలీసులు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. గురువారం తహసీల్దారు హనుమంతురావు, ఎంపీడీవో రఘుపాత్రుని కాశీప్రసాద్, కొత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్, ఎస్‌ఐ ఎండీ యాసిన్ తదితులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిర్వాహకులు నుంచి వివరాలను తెలుసుకున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలకు దుండగులు పాల్పడ్డారని నిర్వాహకులు ప్రభుదాస్ వివరించారు. అగ్నిప్రమాదంలో విలువైన పుస్తకాలు, సామగ్రి కాలిపోయాయని, తీవ్రమైన నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగలను పట్టుకుని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ఎంట్రన్స్ కోసం జూలై 29వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బేతనస్వామి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంట్రన్స్ పరీక్ష 2025 డిసెంబరు 13న జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తుదారులు ప్రభుత్వం లేదా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తతరగతి చదివి ఉండాలన్నారు.

సబ్‌స్పెషాల్టీ ఫెల్లోషిప్ కోర్సులో డాక్టర్ సుష్మ ప్రతిభ



డాక్టర్ సుష్మ

సోంపేట/కాశీబుగ్గ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైద్యుడు డి.గోవింద్ కోడలు డాక్టర్ సుష్మ.. కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ సబ్‌స్పెషాల్టీ ఫెల్లోషిప్ కోర్సులో ఆల్‌ఇండియా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఎంబీబీఎస్ తర్వాత పీడియాట్రిక్స్ పూర్తిచేసుకున్న అనంతరం రాసిన ఈ పరీక్షలో ఉత్తమ ఫలితం సాధించారు. కాగా ఈమె కన్నవారిది పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబాడం గ్రామం. ఈమె తండ్రి చంద్రమోహన్ ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండగా, తల్లి శిరీష పెదంచల పాఠశాలలో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సుష్మ భర్త డాక్టర్ దాసరి అనురాగ్ విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ప్లాస్టిక్ సర్జరీ స్పెషలిస్ట్‌గా పని చేస్తున్నారు. డాక్టర్ సుష్మ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివి గోల్డ్‌మెడల్ సాధించారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు మెడికల్ కళాశాలలో పీడియాట్రిక్స్ విభాగంలో స్పెషలైజేషన్ చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

చినుకుపడితే చిత్తడే



సరుబుజ్జిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏ మాత్రం వర్షం పడినా మండలంలోని పలు గ్రామాల రహదారులు మురుగుగుంతలుగా మారుతున్నాయి. దీనివల్ల వర్షాల సమయంలో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. జేజే రోడ్డు నుంచి బుడ్డివలస గ్రామానికి వెళ్లే సుమారు కిలోమీటరు రహదారి అసంపూర్తిగా ఉండడం వల్ల వర్షాలు రాకపోకలకు ప్రజలు నరక యాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

← బుడ్డివలసకు వెళ్లే రహదారి దుస్థితి

తహసీల్దార్లకు స్థానచలనం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టరేట్ జీ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జీఎల్వీ శ్రీనివాసరావును లావేరు తహసీల్దార్‌గా, రణస్థలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.ప్రసాదరావును పాతపట్నం, ఇక్కడ పనిచేస్తున్న ఎస్.కిరణ్ కుమార్ రణస్థలం బదిలీ అయ్యారు.

లావేరులో శ్రీనివాసరావు బాధ్యతలు

లావేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): లావేరు మండల తహసీల్దార్‌గా జీఎల్వీ శ్రీనివాసరావు నియమితులై య్యారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీపై రాజాం వెళ్లగా.. కలెక్టరేట్ జీ-సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన శ్రీనివాసరావు గురువారం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ శ్రీనివాసరావుకి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు అవసరమైన విత్తనాలు అందించండి

కంచిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్‌లో రైతులకు కొత్తరకం వరి విత్తనాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా చీడాపీడలను తట్టుకునేలా కొత్తరకం విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తికానందున ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. గ్రామాల్లో సారా నియంత్రణకు సభ్యులు సహకరించాలని ఎక్సైజ్ సీఐ జీవీ రమణ కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి టి.శిరీష, ఎంఈవో శివరాంప్రసాద్, ఏపీవో ధనుంజయ, మోహన్, ప్రవీణ్, మధుసూదన్, పాణిగ్రాహి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు గురువారం పయనమయ్యారు. ఈ పోటీలకు పురుషులు, మహిళా జట్లను పంపిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. ఈ జట్టులో టి.యోగేశ్వరరావు, పి.దిలీప్, గణేష్ పండా, వి.రాజశేఖర్, బి.మహేష్, టి.దివాకర్, ఎ.సాహస్, జి.శంకర్ గణేష్, టి.తరుణ్, ఎం.సతీష్, జి.గౌరీశంకర్, ఎల్.యశ్వంత్ కుమార్, బి.హారిక, సీహెచ్ భార్గవి, హెచ్.కల్పన, బి.వెంకటలక్ష్మి, మౌనిక మిశ్ర ఉన్నారన్నారు. కె.రామారావు, ఇ.అప్పన్న కోచ్ కమ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. ఈ పోటీల్లో సత్తాచాటి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే పన్నులు చెల్లించం

- ఇచ్ఛాపురం మునిసిపాలిటీ 20వ వార్డు రత్తకన్న వాసులు
- కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేత



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధి రత్తకన్న 20వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించే వరకు పన్నులు చెల్లించేది లేదని ఆ వార్డుకు చెందిన గ్రామపెద్దలు, మహిళలు కోరారు. ఈ మేరకు వారంతా మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందించారు. రత్తకన్న దేవాంగుల వీధి తూర్పువైపులో సీసీ డ్రైన్, రోడ్డుతోపాటు ఎలక్ట్రికల్ పోల్స్ లేవని, అలాగే కొళిగాం రోడ్డు వరకు పనులు చేపట్టాలని కోరారు. లేదంటే ఇంటి పన్నులు చెల్లించమని స్పష్టం చేశారు. మునిసిపాల్టీ ఏర్పడినప్పటి నుంచి వార్డులో సమస్యలు తిష్టవేసి ఉన్నాయన్నారు. స్థలం కేటాయిస్తే వార్డు ప్రజలు సొంత డబ్బులతో వినాయ మండపాన్ని నిర్మించుకుంటాన్నారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట బయటకు రావాలంటే భయపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు సి.పితాంబరరెడ్డి, పి.పార్వతి, దమయంతి, హరిప్రసాద్ గోపాల్, గీతాంజలి, లక్ష్మి, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో చేర్చుకుంటే కఠిన చర్యలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో చేర్చుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ హెచ్చరించారు. స్థానిక నెహ్రూ యువజన కార్యాలయం వద్ద జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, బ్రెడ్స్ సంస్థ, జిల్లా కార్మిక శాఖ, ఏహెచ్‌టీయూ, ఐసీపీఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ మజ్జి సింహాచలం, బగాది రాములమ్మ, వెంకటేశ్వర్లు, గీత, శ్రీనివాసు, మీనాక్షి, మాధవి, శంకర్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, వివిధ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

కవిటి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సినిమా థియేటర్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని షాపు నిర్మాణంతో ఇబ్బంది కలుగుతుందని గురువారం తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. గొండ్యాల పుట్టుగకు చెందిన ఎం.బాలరాజుతోపాటు మరికొందరు మాట్లాడుతూ.. రోడ్డును ఆనుకొని నిర్మాణం చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఆ దుకాణంలో మందుల షాపు పేరిట రోగులకు వైద్యం చేస్తూవారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన సిక్కోలు క్రీడాకారుడు



గౌరీశంకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బేస్‌బాల్ ఫెడరేషన్ కప్‌లో జిల్లాకు చెందిన ఐ.గౌరీశంకర్ రజిత పతకం సాధించాడు. ఇటీవల 6 నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్ర వేదికగా జరిగిన 12వ ఫెడరేషన్ కప్‌లో పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న గౌరీశంకర్ సత్తాచాటి సిక్కోలుకు పేరు తెచ్చినట్టు ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి అన్నారు. ముఖ్య సలహాదారు పి.సుందరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వీరభద్రరావు, కార్యదర్శి వి.రాంబాబు, తదితరులు అభినందించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముద్దాడపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణపై ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక



బత్తుల సునీత

కంచిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రేఖాదేవిపురం గ్రామానికి చెందిన బత్తుల సునీత ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికైంది. తండ్రి ఆనందరావు స్టేషనరీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి మీనా గృహిణి, సునీతకు ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. సునీత ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రేఖాదేవి పురం ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు డీజీ పురం ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసింది. ఇంటర్, డిగ్రీ సోంపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తిచేసి.. బ్యాంకు పోటీ పరీక్షలకు విజయవాడలో శిక్షణ తీసుకుంది. ఇటీవల రాసిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించడంతో ఒకేసారి ఎస్‌బీఐ క్లర్క్, ఎస్‌బీఐ అప్రెంటీస్, కెనరా బ్యాంకు క్లర్క్ పోస్టులకు ఎంపికైంది. అలాగే ఆర్ఆర్‌బీ పరీక్షల్లో సైతం ప్రతిభ చూపింది.

ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎఫ్‌సీఐ సిబ్బంది

అరసవల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నగరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు 26 మంది రక్తదానం చేశారు. ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ సునీల్‌కుమార్, సందీప్ సర్కార్, శ్రీహరి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, జి.రమణ, పి.చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీ వరకు జిల్లాలో రక్తదాన అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామని రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. రక్తదాన శిబిరాల ఏర్పాటుకు ఆసక్తి గలవారు 9440490525 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట 11 కేవీ, ఎచ్చెర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్ల తొలగింపునకు, వివిధ మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఫరీద్‌పేట, ఎస్ఎం పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రణస్థలం పరిధిలో..

రణస్థలం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ జేఆర్ పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వేల్పురాయి. దేవరాపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, ఎన్.నగరపాలెం, బంటుపల్లి, సంచాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న డీఎస్సీ

ఎచ్చెర్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి మెగా డీఎస్సీ కొనసాగుతుంది. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో గురువారం జరిగిన ఈ పరీక్షల్లో ఉదయం షిఫ్ట్‌లో 100కు 98 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 100కు 89 మంది, శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఉదయం షిఫ్ట్‌లో 157కు 150 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 280కు 264 మంది హాజరయ్యారు.

దూరవిద్య ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీకెండ్ తరగతులు

గుజరాతీపేట. జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యలో 2025 విద్యా సంవత్సరంలో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీకెండ్ తరగతులను నిర్వహించనున్నట్టు డిస్టెన్స్, ఆన్‌లైన్ డైరెక్టర్ ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో గల 22 కేంద్రాల్లో ఒకే తేదీల్లో 10 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పరిధిలో గల విద్యార్థులు వీటిని గమనించగలరని పేర్కొన్నారు. ఆయా విద్యార్థులకు ఈ నెల 14, 15, 21, 22, 28, 29, జూలై 5, 6, 12, 13 తేదీల్లో తరగతులను ఇంగ్లీష, తెలుగు మీడియంలో ఉంటాయన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రతీరోజూ యోగాసనాలు, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంత జీవనం లభిస్తుందని జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా గురువారం స్థానిక 80 అడుగుల రోడ్డులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో యోగ సాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా పట్ల అందరూ అవగాహన పెంచుకుని, నిత్యమూ సాధన చేయడం వలన చక్కని ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, ఆయుష్ శాఖ నుంచి చంద్రశేఖర్, పౌరసరఫరాల శాఖ డీటీలు, సిబ్బంది, డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

లావేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగాదినోత్సంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ కోరారు. గురువారం లావేరు ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సిబ్బందికి అవగాహన కల్పించారు. లావేరు మండలం నుంచి 6వేలు మంది వరకు హాజరైయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వెలుగు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటపతిరాజు, డీపీఎంలు రవికుమార్, మోహన్‌రావు, స్త్రీనిధి మేనేజర్ ఉదయ్‌కుమార్, ఏపీఎం బీవీ సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2న పౌరాణిక, పద్య నాటక ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన ఉత్తరాంధ్ర జానపద పౌరాణిక పద్య నాటక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్టు సమాఖ్య ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 9440347848 ఫోన్ నెంబరులో సంప్రదించి రూ.300 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు.

రిఫ్రిజరేటర్ వితరణ

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న మనోవికాస కేంద్రానికి మిమిక్రీ శ్రీనివాస ఆధ్వర్యంలో రిఫ్రిజరేటర్‌తోపాటు గ్యాస్ స్టవ్, రైస్ కుక్కర్ వితరణగా అందజేశారు. బొంతావారి వీధిలో ఉన్న గీతా మందిరానికి ఇన్వర్టర్‌ను జోగి హరికృష్ణ దంపతులు అందచేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మురికయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ఇచ్ఛాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం విద్యామిత్ర కిట్లు జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అదిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనువాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణ, బి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్ ఎప్పుడు?

- విద్యార్థులున్నా అనుమతుల్లేవు
- 5 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది
- 9, 10 తరగతుల విద్యార్థుల ఆవేదన
- ఇదీ అనంతగిరి ప్రాథమికోన్నత పాఠశాల తీరు

వజ్రపుకొత్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అనంతగిరి పంచాయతీ ప్రజలు 95 శాతం మంది కూలీ చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఆర్థిక ఇబ్బందులతో వారి పిల్లల చదువులు ప్రభుత్వ పాఠశాలల్లోనే.. అయితే గ్రామంలో ఉన్న పాఠశాలలో 8వ తరగతి వరకు మాత్రమే ఉండడంతో 9, 10 తరగతుల విద్యార్థులు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పాఠశాల స్థాయిని పెంచాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆవేదన ఆ పంచా యతీ వాసుల్లో నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు 162 మంది విద్యార్థులు చదువుతున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు 50 మంది ఉన్నారు. 8వ తరగతి వరకు గ్రామంలోనే చదువులు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే 9, 10 తరగతులు చదవాలంటే 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస మండలం బ్రాహ్మణతర్లా, నందిగాం మండలం పెద్దబాణాపురం ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో తమ పిల్లలు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వారు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంటోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అంతదూరం బాలికలను పంపేందుకు వారు ఇష్టపడడం లేదు. దీంతో వారంతా మధ్యలోనే చదువుమాన్పించేస్తున్నారు.



అనంతగిరి పాఠశాల

అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నా..

అనంతగిరి పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గత ఏడాది నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. జిల్లా అధికారులు వచ్చి పరిశీలించినా నేటికీ ఎటువంటి పురోగతి కనిపించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు పూర్తిస్థాయి వసతులున్నాయని, 9, 10 తరగతుల నిర్వహణకు భవనాలున్నాయని, అయితే సాంకేతిక కారణాలు చెప్పి పాఠశాల అప్‌గ్రేడ్ చేయడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పాఠశాలకు అవసరమైన వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోనే 10వ తరగతి వరకు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



అనంతగిరి గ్రామస్థులు అల్పాదాయవర్గానికి చెందినవారు. ప్రభుత్వ పాఠశాలోనే పిల్లలను చదివి స్తారు. గ్రామంలో 8వ తరగతి వరకు ఉంది. 9,10 తరగతులు చదవాలంటే 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. బాలికలు చదువు మధ్యలోనే ఆగిపోతోంది. అధికారులు స్పందించి పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి.

-ఉంగ భుజంగరావు, అనంతగిరి

జిల్లా అధికారులకు విన్నవించాం

అనంతగిరి ప్రాథమికోన్నత పాఠశాల అప్‌గ్రేడ్ కోసం జిల్లా అధికారులకు విన్నవించాం. పాఠశాలలో వసతులు కల్పించేందుకు గ్రామస్థులు ముందుకు వచ్చారు. గ్రామ పరిస్థితులను వివరించాం. జిల్లా అధికారుల ఆదేశాల కోరకు వేచి చూస్తున్నాం.

-దాశరథి, ఎంఈవో, వజ్రపుకొత్తూరు

28.5 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

కంచిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బిహార్‌లోని రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన అమీర్‌ఖాన్, పాశ్వాన్ కామేంద్రరామ్ నుంచి సుమారు 28.550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్టు సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. గురువారం కంచిలి పోలీసుస్టేషన్‌లో వివరాలను విలేకరులకు వెల్లడించారు. రఘునాథ్‌పూర్‌కి చెందిన వారిద్దరూ.. ఒడిశా రాష్ట్రం మారపల్లి గ్రామానికి చెందిన సంచి సభాపతి వద్ద గంజాయిని కొనుగోలు చేసి బిహార్‌లో సాహిద్ ఆలామ్‌కి అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో గంజాయిని లారీలో తరలిస్తూ హైవే మీదుగా కంచిలి చేరుకున్నారు. జాతీయ రహదారిపై దిగిన వీరిద్దరూ గంజాయి బ్యాగులతో కంచిలి రైల్వే క్వార్టర్స్ వద్దకు చేరుకుని రైలు కోసం వేచి ఉన్నారు. ఇదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది వారిని తనిఖీ చేశారు. బ్యాగుల్లో గంజాయిని గుర్తించడంతో వారిని అదుపులోకి తీసుకుని, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధి సీపన్నాయుడుపేటలో సంపతి రావు సాయిలోహిత్(23) బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన సంపతిరావు పెద్దతవిటయ్య కుటుంబం వివాదాలు కారణంగా.. అతని భార్య, కుమారుడు సాయిలోహిత్‌తో కలిసి సీపన్నాయుడుపేటలో గత రెండేళ్లుగా నివాసం ఉంటుంది. సాయిలోహిత్ పెయింటింగ్ పనులు చేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏమైందోగాని బుధవారం సాయంత్రం గదిలో శ్లాబు హుక్కుకు తాడుతో ఉరి వేసుకోగా.. అతడి తల్లి కోటబొమ్మాళి పండగలకు రాత్రి వెళ్లి వచ్చి చూసేసరికి కుమారుడు విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సాయంతో ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చింది. టూటౌన్ ఎస్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ఉదయం రిమ్స్‌కు తరలించారు. తండ్రి సంపతిరావు పెదతవిటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు

ఎచ్చెర్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొత్త జాతీయ రహదారిపై ఎచ్చెర్లకు సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని వృద్ధురాలు(65) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసు లు తెలిపిన వివరాల మేరకు.. ఆ వృద్ధురాలు జాతీయ రహదారిపై బుధవారం అపస్మారక స్థితిలో ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెను 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో పోలీసులు చేర్పించగా, చికిత్స పొందుతూ గురువారం ఉద యం చనిపోయింది. మృతురాలి వివరాలు తెలియకపోవడంతో ఆసుపత్రిలోని మార్చురీలో మృత దేహాన్ని భద్రపరిచారు. ఆమె వివరాలు తెలిసినవారు 6309990853 నెంబరులో సంప్రదించాలన్నారు.

పశువుల పట్టివేత

కవిటి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్టు కవిటి ఎస్ఐ వి.రవివర్మ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గురువారం తెల్లవారు జాము న శిలగాం గ్రామ జంక్షన్ జాతీయ రహదారి పై ఓవర్ వద్ద రెండు వాహనాల్లో 14 పశువులను తర లిస్తూ పట్టుబడ్డాయి. ఒడిశాలోని గొలంత్ర నుంచి నరసన్నపేటకు చెందిన రెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి తిలారు సంతకు తరలిస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి పశువులను కొత్తవలసలోని హెల్పింగ్ హాండ్స్ సంస్థకు అప్పగించామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

ఎచ్చెర్లలో ఏడు..

ఎచ్చెర్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలం నారాయణవలస సంత నుంచి అలమండ (విజయనగరం)కు గురువారం ఓ వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న ఏడు పశువులను కుశాలపురం బైపాస్ కూడలికి సమీపంలో పట్టుకున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. వీటిని కొత్తవలస గో సంరక్షణా కేంద్రానికి తరలించామన్నారు. కేస నమోదు చేసి చేసినట్టు తెలిపారు.


టోల్‌ప్లాజా వద్ద ఐదు..

నరసన్నపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బరంపురం నుంచి రాజమండ్రికి వాహనంలో ఐదు గేదెలను తరలిస్తుండగా మడపాం టోల్‌ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున తనిఖీ చేసి పట్టుకు న్నామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ వాహనం పై కేసు నమోదు చేసి గేదెలను అలమండ పశుసంరక్షణ కేంద్రానికి పంపించామని పేర్కొన్నారు.

వృద్ధురాలి హత్యపై దర్యాప్తు ముమ్మరం

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం పెద్దహరిశ్చంద్రపురం కాళింగ వీధికి చెందిన దుంపల దాలమ్మ హత్యకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీఐ శ్రీనివాస రావు, ఎస్ఐ సత్యనారాయణలు లోతుగా దర్యాప్తు చేపడుతున్నారు. వృద్ధురాలి హత్యకు సదరు గ్రామానికి చెందిన వ్యక్తే కారణమని భావించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఆమె మెడలో పుస్తెలతాడు కోసమే హత్య చేశాడని భావిస్తున్నారు. ఈ విషయమై సీఐ శ్రీనివాసరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా నిందితుడు అదే గ్రామానికి చెందినవాడని, దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం


మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

కాశీబుగ్గ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి అన్నారు. గురువారం స్థానిక సూర్యతేజ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను వినియోగించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పద్మజీ కామేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాకి 763 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 263 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, నరేంద్రబాబు, సూర్య నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని సహాయ కార్మిక అధికారి ఆర్.రాధాకుమారి అన్నారు. గురువారం న్యాయసేవాధికార సంస్థ పిలుపు మేరకు టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దుకాణాలను తనిఖీ చేశారు. బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు బాలలను పనిలో పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మెట్ట గోవింద్, ఆనందరావు, చంద్రుడు, ధర్మరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే బడిఈడు పిల్లలుండాలి

ఎల్.ఎన్.పేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, వారిని తప్పనిసరిగా బడిలో చేర్పించాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు మన్మథ కుమార్‌మిశ్రో అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినం సందర్భంగా గురువారం లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరూ చదువుకోవాలని, ఆ దిశగా తల్లిదండ్రులు చైతన్యం పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.రమాదేవి, ఉపాధ్యాయుడు టి.ఉపేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరుద్ర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు

- పరిశీలించిన కేంద్ర బృందం

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టెక్కలి, పలాస మండలాల్లోని పలు గిరిజన గూడల్లో రోడ్ల నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అథారిటీ బృందం గురువారం పర్యటించి వివరాలు సేకరించింది. ప్రధానమంత్రి జన్మాన్ పథకం కింద అవసరమైన రోడ్ల నిర్మాణాలకు చేయాల్సిన ప్రతిపాదనలు పరిశీలించారు. ఎన్ఆర్ఐ డీఏ సివిల్ ఇంజనీర్ వరుణ్ సక్య, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ, డీఈఈ చంద్రినాయుడు, ఏఈ మోహన్ తదితరులు పర్యటించారు. టెక్కలి మండలం లంకపాడు గ్రామానికి రూ.2కోట్లు, చిన్నకేదారికి రూ.1.80 కోట్లు, పలాస మండలం పొత్రియా గ్రామానికి రూ.2.70 కోట్లతో రహదారులు వేసేందుకు ఏ మేరకు అవసరం అన్నది పరిశీలించారు.

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఏప్రిల్ 10న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ టెక్కలి మండలం లోని గిరిజన గ్రామాలను సందర్శిం చారు. ఏప్రిల్ 21న ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు నర్సింగ పల్లిలో గ్రామసభలు నిర్వహించి పనులకు ప్రతిపాద నలు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐడీఏ బృందం పీఎం జన్మాన్ పథకం కింద అవసరమైన రోడ్లు వేసేందుకు గాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారితో పాటు గుజ్జూరు సత్యం తదితరులు ఉన్నారు.


చిన్నకేదారి గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న ఎన్ఆర్ఐడీఏ బృందం

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

నరసన్నపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. గురువారం నరసన్నపేట పట్టణం బండివీధి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పిల్లల సంఖ్యను పెంచి వారి మానసిక పరిపక్వతకు దోహదపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవో శోభారాణి, సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో అక్షరాలు దిద్దించి..


చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న పీడీ

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ పిల్లలతో అక్షరాలు దిద్దించి దీవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపరచాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా ఇంజనీరింగ్ బృందం గొట్టాబ్యారేజీ సందర్శన


ఈఈ నుంచి వివరాలు సేకరిస్తున్న ఒడిశా సీఈ నాగమోహన్

హిరమండలం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ స్థితిగతులపై అవగాహన చేసుకునేందుకు గురువారం ఒడిశా ఇంజనీరింగ్ బృందం పరిశీలించింది. వంశధార నదిపై అంతర్రాష్ట్ర వారధిగా గొట్టాబ్యారేజీపై అవగాహన పెంపొందించుకునేందుకు వచ్చినట్లు భువనేశ్వర్ సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ జి.నాగమోహన్ తెలిపారు. అనంతరం కంట్రోల్ కార్యాలయంలో గొట్టాబ్యారేజీ నీటి ప్రవాహం, స్థితిగతులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వంశధార నరసన్నపేట ఈఈ డీఎస్ ప్రదీప్, ఇరు రాష్ట్రాల ఇంజనీరింగ్ బృందం ప్రతినిధులున్నారు.

ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈగా సత్యనారాయణ


సత్యనారాయణకు సిబ్బంది అభినందన

టెక్కలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్అండ్‌బీ ఎస్ఈ పి.సత్యనారాయణ టెక్కలి ఇన్‌చార్జి ఈఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయనకు డీఈఈ రవికాంత్, ఏఈ జగదీష్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

వైభవంగా సీతారామ కల్యాణం

నరసన్నపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్-పురుషోత్తంనగర్ కాలనీ శ్రీరామ మందిరంలో గురువారం సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మందిరం వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పలాస, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాజీ నగర్‌లోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం చేశారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉమారుద్ర కోటేశ్వర స్వామిని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూ రావు, భవాని దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పీఏసీఎస్ మాజీ అధ్య క్షుడు, శిర్డీ సంస్థాన్ వ్యవస్థాపకుడు దువ్వాడ శ్రీధర్ దంపతులు, తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

'ఉపాధి' అక్రమ వసూళ్లపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

నందిగాం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్లు అక్రమ వసూళ్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని మండల సమావేశంలో తీర్మానించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు సభ్యులు వై. చక్రవర్తి, పి.ఆశారాణి, టి.రాజు, పి.మోహనరావు తదితరులు మాట్లాడుతూ.. గ్రామాల్లో వేతనదారుల నుంచి దొంగ మస్తర్లు, రూ.50 చొప్పున వేతనం ఎక్కువగా వేస్తా మని చెబుతూ టెక్నికల్ అసిస్టెంట్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఏపీవో ఎం.నాగరాజు కలుగజేసుకొని మాట్లాడుతూ.. వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు చేస్తే థర్డ్‌పార్టీ దర్యాప్తు నిర్వహిస్తామన్నారు. సభ్యులు కలుగజేసుకొని విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని తీర్మానిస్తూ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మీకాంతం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.4.95 లక్షలు

పాతపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ ఆదాయం రూ.4,95,500 వచ్చినట్లు కార్య నిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు. టెక్కలి గ్రూపు దేవాలయాల ఈవో టీపీ మనశ్విని పర్యవే క్షణలో గురువారం హుండీలను లెక్కించారు. కార్యక్రమంలో వేంక టేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బావుల్లో క్లోరినేషన్ చేయించండి

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీలో మండా పొలం కాలనీ, రోటరీనగర్ తదితర ప్రాంతాల్లోని బావుల్లో క్లోరినేషన్ చేయించాలని, కాలువల్లో పూడికలు తొలగించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు గురువారం మేజర్ పంచాయతీ ఈవో జి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు సోకే ప్రమాదం ఉంది, పంచాయతీ అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శతశాతం హామీల అమలు కూటమికే సాధ్యం

హిరమండలం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా గురువారం హిరమండలంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో నాయకులు ధనికులయ్యారని, రాష్ట్రాన్ని ఆర్థికంగా వెనక్కి నెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాన రీతిలో సీఎం చంద్రబాబునాయుడు ముందుకు తీసుకువెళుతున్నారన్నారు.

కొమనాపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జలుమూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొమనాపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ ఉమారావు అనేక అక్రమాలకు పాల్పడినట్లు జిల్లా అధికారులకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం సచివాలయంలో ఉపాధి ఏపీడీ కె.లోకేశ్ విచారణ చేపట్టారు. ఉపాధి పనికి రాకుండా చాలా మంది లబ్ధిదారులకు మస్టర్లు వేసి వేతనాలు చెల్లించి అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వేతనదారులను విచారించి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు, నివేదికను జిల్లా అధికారులకు అందించ నున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జనార్దనరావు, సర్పంచ్ కనుసు సీతారాం, మాజీ ఎంపీటీసీ సాధు ఉమా, మాజీ సర్పంచ్ కనుసు రవి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

పాతపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా రిపోర్టు చేయాలన్నారు. అలాగే ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవ త్సరంలో మిగులు సీట్లకు ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 24న దరఖాస్తుదారులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

లోఓల్టేజీతో అవస్థలు

పలాసరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నంలో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఉదయం, సాయం సమయాల్లో లోఓల్టేజీ వస్తోందని, దీంతో బల్బులు కూడా వెలగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక పర్యాయాలు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. లోఓల్టేజీతో వ్యాపారాలు సన్నగిల్లాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

టెక్కలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆదీఆంధ్రావీధిలో తరచూ లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు గురువారం ట్రాన్స్‌కో ఈఈ శంకరరావును కలిసి వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఐ ప్రోగ్రాం పనులను చేపడుతున్నందున పాతపట్నం, దశరథపురం, బైరాగిపేట, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నా మన్నారు. అలాగే చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున పాతపట్నంలోని అంతరాబ, బీఎస్ఎఫ్ కాలనీ, సరాళి రోడ్డు, అటవీశాఖ కార్యాల యం ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

పలాసరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలని గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు. రంగోయిలో గురువారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష మాట్లాడుతున్న రాష్ట్రాల్లో తెలుగు మీడియం లేకపోవడం దురదృష్టకరమని, తక్షణం దీనిని పునరుద్ధరించాలని కోరారు. తెలుగు భాషా సంస్కృ తులను కాపాడాలన్నారు. త్వరలో తెలుగుభాష పీఠం ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమం కోసం కార్యా చరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జి.కామరాజు, నల్ల జయశంకర్, ఎస్.సోములయ్య, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పాతపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌వీధికి చెందిన రాయబిల్లి రామకృష్ణ (38) గురువారం ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాల మేరకు.. రామకృష్ణ హైదరాబాద్‌లో నివాసముంటూ తాగుడుకు బానిస అయ్యాడు. దీంతో భార్య, ముగ్గురు పిల్లలు గత మూడేళ్లుగా అతనికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల కాలంలో అతని మానసిక స్థితి బాగులేకపోవడంతో పాతపట్నంలోని ఇంటికి చేరుకున్నారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తల్లి రాయబిల్లి శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎల్.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.